**కథ**

# వీక్‌నెస్

వెలమకన్ని మధుమతి

**ఆదరాబాదరా ఆటో దిగి ఒక్క అంగలో మానేజర్ కాబిన్‌లోకెళ్లి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి ఊపిరి పీల్చుకుంది వనజ. తెల్లవారు ఝామున లేచినప్పటి నుండే మిషన్‌లా గిరగిరా తిరుగుతూ ఇంట్లో అన్ని పనులూ చక్కబెట్టుకుని, అందరికీ అన్నీ అమర్చి అదే స్పీడులో తనూ చీర చుట్టేసుకుని, నోట్లో ఇంత కుక్కేసుకుని టైమ్‌కి ఆఫీసుకొచ్చేయడం ఆమెకి అలవాటైపోయింది. ఆ టైమ్‌లో ఒక ఫోన్ గానీ, ఎవరైనా రావడం గానీ జరిగిందా.. మొత్తం షెడ్యూలు దెబ్బతింటుంది.**

ఈ రోజు అలాగే అయింది. దాంతో 'తినే' కార్యక్రమాన్ని మానుకుని వచ్చేయటం వలన ఆఫీసుకి టైమ్ లోపల వచ్చేయగలిగింది. మానేజర్ చేత మాట పడకూడదనుకునే వీక్‌నెస్. ఆ వీక్‌నెస్ మానేజరుకి బాగా తెలుసు. ఆయనకి విష్ చేసి వనజ తన సీట్లోకి వెళ్లబోతుంటే ''మాడమ్! లక్ష్మిగారికి ఒంట్లో బాగుండలేదట, రెండు రోజులు లీవ్ పెట్టారు. కొంచెం ఆ పని కూడా మీరే చూసుకోవాలి. అఫ్‌కోర్స్! రామారావుగారు మీకు హెల్ప్ చేస్తారనుకోండి'' అన్నాడు మానేజర్.

''అలాగే సర్'' అని అంటుంటే ఫీల్డ్ ఆఫీసర్ రామారావు కాబిన్‌లోకి వచ్చాడు.

''మాడమ్‌కి కొంచెం హెల్ప్ చెయ్యాలి రామారావ్ ఈ రోజు''

''ఓ! తప్పకుండా. అయితే నేను ఒక అరగంట ఇంటికెళ్లి వస్తాను సర్. ఉదయం నుంచీ రికవరీకి తిరుగుతున్నాను''

''అరె! అలాగా, వెళ్లి రండి మరి'' రామారావ్ మీద బోలెడు జాలి పడిపోయి అతన్ని ఇంటికి పంపాడు మానేజరు.

వనజ సీట్లో కూర్చున్నాక అనుకుంది. ''యస్సర్'' అనైతే అంది కానీ, రెండుసీట్ల పని చెయ్యగలదా తను!

''నో'' అనలేని వీక్‌నెస్.

సాయంత్రానికి చాలా అలసిపోయింది. రోజూ కంటే గంట లేటుగా ఇంటికెళ్లాల్సి వచ్చింది. రామారావు సహాయం చెయ్యటం కాదు కదా, కనీసం ఆమెవైపు కన్నెత్తి కూడా చూడలేదు. రోజూ కంటే చాలా బిజీగా కనిపించాడు.

రెండు రోజులే కదా అని ఓర్పుగా చేసుకుపోతుంటే ''లక్ష్మి లీవు పొడిగించిందనీ, పదిహేను రోజుల దాకా రాదనీ'' పిడుగులాంటి వార్త చెవిన వేశాడు మానేజరు.

అప్పుడైనా ''ఇంకొకర్ని డెప్యుటేషన్ మీద పంపమని రీజనల్ ఆఫీసుకు అడగమని'' మానేజర్‌తో అనవచ్చుగా. ఊహూ! అలా అడగలేని 'వీక్‌నెస్'. ఎలాగూ తప్పదు కనుక మైండ్‌సెట్ మార్చుకుని పనంతా చక్కగా ప్లాన్ చేసుకుని చెయ్యడం మొదలెట్టింది వనజ. లంచ్‌టైమ్‌ని తగ్గించేసుకుంది. కొంత హోంవర్క్ కూడా చెయ్యాల్సి వచ్చింది. రెండు మూడు రోజుల్లోనే పనంతా పూర్తి చేసుకుని మామూలు టైమ్‌కి ఇంటికెళ్లగలుగుతోంది.

నెల రోజులయ్యాక కూడా లక్ష్మి మాడమ్ డ్యూటీలో చేరలేదు. ''ఆమెని ఇంకొక చోటికి బదిలీ చేశారనీ, ఉన్న స్టాఫ్‌తోనే సర్దుకోవాలని ఆర్.ఎమ్. మీటింగ్‌లో చెప్పాడనీ చావుకబురు చల్లగా చెప్పాడు మానేజరు.

కొంచెం అలసటగా ఉన్నా, ఎలాగూ అలవాటు పడిపోయింది కనుక వనజ ఏమీ చలించలేదు. పైగా, పైవాళ్ల మెప్పు కోసం ఇదంతా ఆయన నిర్వాకమేనేమో అని అనుమానం కూడా వచ్చింది ఆమెకి.

రామారావు మాత్రం ''అదెలా సార్! ఇంత పనీ మా ఇద్దరి వలనా ఎలా అవుతుంది? మీరు గట్టిగా అడగాలి సార్'' అని దబాయించాడు.

''ఏం చేస్తామయ్యా! పైవాళ్లు ఎంత చెప్తే అంత. అయినా వనజా మాడమ్ చాలా సునాయాసంగా చేసుకుపోతోంది కదా, రియల్లీ షి ఈజ్ కాపబుల్!'' చాలా చాకచక్యంగా స్టాఫ్ చేత పని చేయించుకోగలను అని మానేజర్ పొంగిపోతూ అన్నాడు.

''కాదు సర్! నేను చాలా అలసిపోతున్నాను. ఎప్పటికీ అంటే రామారావుగారు కొంత షేర్ చెయ్యాల్సి ఉంటుంది'' అని అందామనుకుని నవ్వి ఊరుకుంది వనజ.

అసహాయతని చెప్పుకోలేని వీక్‌నెస్.

★ ★ ★

ఇద్దరి పని చేస్తూ కూడా ఆరింటికల్లా బాగ్ చంకన పెట్టుకుని వనజ ఇంటికెళ్లిపోవడం రామారావుకి రుచించలేదు. తనని సహాయం అడగకపోగా తన ఉనికినే గుర్తించకుండా ఆమె పని చేసుకుపోవటం అతను జీర్ణించుకోలేకపోతున్నాడు. లక్ష్మి బదిలీ అయ్యాక సేఫ్ తాళాలు రెండో సెట్ అతని చేతికి వచ్చాయి.

సాయంత్రం క్యాష్ లోపలపెట్టే సమయానికి ఏదో ఒక పనిమీద బయటికెళ్లి ఆలస్యంగా రావడం మొదలెట్టాడు రామారావు. దాంతో అతని కోసం ఎదురుచూడడం తప్ప ఏమీ చెయ్యలేకపోతోంది వనజ. అతను కావాలనే ఇలా చేస్తున్నాడని గ్రహించినా సహోద్యోగి మీద ఫిర్యాదు చెయ్యలేని బలహీనత... మౌనంగా ఊరుకుంటోంది. ఇంటికి చాలా ఆలస్యంగా వెళ్తోంది. భర్త సణుగుడు మొదలైంది. పిల్లల చదువు సంధ్యలు పట్టించుకోలేకపోతోంది. ''దీనికి పరిష్కారం ఏంటి? ఎప్పటికీ ఇంతేనా? రామారావుకి ఎలా చెప్పాలి? లేక మానేజరుకి చెప్పుకోవాలా తన బాధ?'' కుర్చీలో వెనక్కివాలి ఆలోచిస్తుంటే ''క్యాష్ లోపల పెడదాం రండి మాడమ్. ఇక నుండీ బయటికెళ్లే ముందు తాళాలు నాకిచ్చి వెళ్లమని రామారావుకి చెప్పాను'' అంటూ వచ్చాడు మానేజర్. తన మొర ఆలకించి పరిష్కారాన్ని చూపిన ఆయనకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది.


మర్నాడు మార్కెటింగ్ పని అప్పగించినప్పుడు గానీ ఆ జాలి, దయలకి కారణం తెలిసి రాలేదు వనజకి.

''అదేంటి సార్! బయట తిరిగే పని చెయ్యలేననే కదా నేను ఫీల్డాఫీసర్‌గా వెళ్లంది. మళ్లీ ఇదేంటి? రామారావుగారే ఈ పని కూడా చేసేస్తే బాగుంటుంది'' ఎలాగో గబగబా అనేసింది.

''అలా అయితే అతని సీటు వర్క్ మీరు కొంత తీసుకోవాల్సి ఉంటుంది మాడమ్.''

'ఇప్పుడే ఒక పని కాదని చెప్పింది. వెంటనే ఇదీ కాదంటే బాగుండదేమో!' మొహమాటం..

''అలాగే సర్! ఆయన డెస్క్ పని నేను చూసు



కు ం

టాను'' రామారావు,
మేనేజర్ మొహాలు చూసుకు
న్నారు. రామారావు బయటికె
ళ్లడం వలన అతని సొంత పను
లతో పాటు, బిల్లులు కట్టడం,
పిల్లల్ని ట్యూషన్‌కి దింపడం లాంటి తన
సొంత పనులు గూడా బాగా జరిగిపోతున్నాయి.
ఇంక వనజ సంగతికొస్తే, ఎంత పనిచ్చినా హరా
యించేసుకుని పెండింగ్ పెట్టకుండా చేసేయగ
లదు. తను నీడ పట్టున బొజ్జ పెంచుకుంటూ
ఏ టెన్షనూ లేకుండా హాయిగా గడిపేయటమే
కాకుండా పై ఆఫీసు నుండి ప్రశంసలూ అందు
కోవచ్చు. ఆమె బలహీనత ఆధారంగా చిన్న
ట్రిక్కు వేశాను, ఫలించింది. పొంగిపోయాడు
మానేజరు.

★ ★ ★

పని వత్తిడితో వనజ బాగా నీరసించింది. తను లీవ్ పెడితే ప్రపంచం తలక్రిందులైపోతుందేమో నన్నట్లు ముక్కుతూ మూలుగుతూ అలాగే బండి లాగిస్తోంది. పైగా ఆదివారాలు, సెలవురో జుల్లో కూడా వెళ్తే కానీ పని పూర్తి కావడం లేదు.

కాస్త
ఊరడింపు వచనాలతో మనసుకైనా ఉపశమనం దొరుకుతుందేమోనని ఆఫీసు విషయాలు భర్తకి చెప్తే అతను వనజకే చివాట్లు పెట్టాడు. ''తప్పంతా నీదే. ఎంత బరువు వేసినా మోస్తుంటే ఎదుటివాళ్లకి నీ బాధ ఎలా తెలుస్తుంది? నువ్వెంత చెయ్యగలవో అంతే చెయ్యి. నీకు అదనంగా జీతం ఏమీ రాదు. ఎవరూ నీకు

మెచ్చి
మేకతోలు కప్పురు. నీ
ఆరోగ్యం పాడుచేసుకోవడమే కాక ఇంటినీ, సంసారాన్నీ నెగ్లక్ట్ చేస్తున్నావు. నీ పద్ధతి మార్చుకో, నేను తాళాలు మీ మానేజర్‌కి ఇచ్చి వస్తాను. నువ్వు డాక్టర్ దగ్గరకెళ్లు.'' బలవంతంగా ఆమె చేత లీవు పెట్టించాడు వనజ భర్త.

★ ★ ★

నెల రోజులు గడిచాయి. డాక్టరు దగ్గరకెళ్లిన ప్పటి నుండి మనసు హాయిగా ఉంటోంది. బలానికి టానిక్కులూ, బికాంప్లెక్స్ మాత్రలు తీసుకుంటూ కొంచెం ఓపిక తెచ్చుకుంది. రామారావు సీట్లో పనిని చాలా వరకూ తనే అడిగి మరీ చేసేస్తోంది. అంటే ముగ్గురి పనీ ఆమె ఒక్కత్తే చేస్తుంటే రామారావు ఒక్క బయట తిరిగే పని మాత్రం చేస్తున్నాడు. అత నితో పాటు మానేజర్ కూడా చాలా సంతోషంగా కనిపిస్తున్నాడు. వనజ ఎదురుచూస్తున్నా సీట్లు మారాల్సిన సమయం వచ్చేసింది.

## సంచలనం

**'సూపర్' చిత్రంతో జనాన్ని అలరించిన ఆయేషాటకియా ఇప్పుడు కొత్త ఏడాదిలో కొత్త అవకాశాల వైపు పరుగులు తీస్తోంది. నిఖిల్ అద్వానీ కొత్త చిత్రం 'సలాం-ఇ-ఇష్క్' తో పాటూ సుభాష్‌ఘయ్ కొత్త చిత్రం షాదీ సె పెహ్లే, నసీరుద్దీన్‌షా కొత్తచిత్రం యున్ హోతా క్యా హోతాలో నటిస్తోంది. మొత్తానికి ఏడాది ప్రారంభంలోనే బాలీవుడ్‌లో నిలదొక్కుకునే ప్రయత్నాలు కన్పిస్తున్నాయి. కొత్తదనంతో కూడిన నటనకి తాను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానంటోంది ఆయేషా.**



ముగ్గురున్నప్పుడు వనజ, లక్ష్మి డెస్క్‌లు మారేవారు. రామారావు మాత్రం ఎప్పుడూ అదే సీటు. ఇప్పుడిక వనజ ఒక్కతే కనుక సీటు మారే ప్రసక్తే లేదు. అయినా తన వంతు తప్పు లేకుండా ఒక మాట అడిగితే సరిపోతుందని నామమాత్రపు స్టాఫ్ మీటింగు పెట్టాడు మానేజరు.

''పాపం! రామారావు చాలా కష్టపడుతున్నాడు తిరగలేక. అయినా లేడీస్‌కి హెల్ప్ చెయ్యడం కోసం తను ఆ సీట్లోని కంటిన్యూ అవుతాడట మాడమ్'' అని వనజకి ఆఫీస్ ఆర్డర్ బుక్ ఇచ్చి, ''యూ ఆర్ రియల్లీ గ్రేట్ రామారావ్'' అన్నాడు రామారావు వంక క్రీగంట చూస్తూ. తను చెయ్యాల్సిన పనులు ఒక పేజీ నిండా ఉండగా రామారావు సీటుకి ఒకే ఒక ముక్క 'ఫీల్డ్ వర్క్' అని ఉంది ఆఫీసార్డర్‌లో.

కడుపు మండిపోయింది వనజకి. నెల క్రితం డ్వాక్టర్ దగ్గరకెళ్లినప్పుడు కలిసిన లేడీ మెడికల్ రిప్రజెంటేటివ్ మాటలు గుర్తొచ్చాయి వనజకి.

''ఆడవాళ్లు మార్కెటింగ్ అంటే అనవసరంగా భయపడ్డారు మాడమ్. ఫీల్డ్ వర్క్ అనగానే ఎవరెవర్నో కలవాలి. ఏవో ఫేస్ చేయాల్సి వస్తుందని ఊహించుకుని వెనకడుగు వేస్తారు. ఎన్నో అలవెన్సులు కూడా వదులుకుంటారు. ఈ వీక్‌నెస్ మగవాళ్లకి ప్లస్ పాయింట్. ప్రొడక్ట్సు గురించి మార్కెటింగ్ చెయ్యడంలో కూడా లేడీస్‌కి ఎక్కువ ప్రావీణ్యత ఉంటుందని నా అభిప్రాయం. ఓర్పు, పట్టుదల ఎక్కువ కనుక టార్గెట్ చేరుకోవడం కూడా చాలా తేలిక. లేడీ అవడం వలన నాకు డ్వాక్టరు అపాయింట్‌మెంట్లు కూడా త్వరగా దొరుకుతాయి. ముక్కుసూటిగా, వచ్చిన పని చూసుకుని వెళ్లిపోతాను. ఈ పనిలో ఇప్పటివరకూ నేను ఎటువంటి ప్రాబ్లెమ్స్‌నీ ఎదుర్కోలేదు.''

ఆనాడే నిర్ణయించుకుంది రామారావ్ సీట్లో పనిచెయ్యాలని. అందుకే ఆమె సీటులో పని పెంచేసి ముగ్గురి పని తానొక్కత్తే చెయ్యగలదని కూడా నిరూపించింది. ఒకసారి రామారావు వంక చూసింది. ధీమాగా వెనక్కు వాలి కాలూపుకుంటూ కూర్చున్నాడు. రిజిస్టర్ మానేజర్‌కి తిరిగి ఇస్తూ ''రామారావుగారి పేరు కొట్టేసి అక్కడ నా పేరు రాయండి సర్'' అంది వనజ. బాంబు పేలినట్లు ఇద్దరూ ఉలిక్కి పడ్డారు.

''మాడమ్.. మీరు..ఫీల్డ్ వర్క్...'' మాటలు రాలేదు మానేజరుకి.

''మాడమ్ జోకులేస్తున్నట్టున్నారు. టైమ్‌గాని టైమ్‌లో వెళ్లాలి.. రకరకాల వాళ్లని కలవాలి.. మగవాళ్లం మా మాటే వినరు..'' భయపెట్టబోయాడు రామారావ్.

''అన్నీ చూసుకోగలను'' వీక్‌నెస్‌ని జయించింది వనజ. నిర్ణయం చాలా దృఢంగా ఉంది.

★ ★ ★

పది రోజుల్లోనే ఆమెకి తెలిసిపోయింది. ఆ సీట్లో పని ఎంత ఉందో. 'నెల రోజుల పని వారం రోజుల్లో పూర్తి చెయ్యవచ్చు. అంటే మిగిలిన మూడు వారాలు రామారావ్ ఎంజాయ్ చేసేవాడన్నమాట' చాలా వరకు పని ఫోన్ మీదే అయిపోతోంది. ఏవో కొన్ని మొండి బకాయిల కోసం, స్టాక్ చెకింగ్ గురించి బయటికెళ్లాల్సి వస్తోంది. పది రోజుల్లోనే పనిలో పట్టు సంపాదించేసింది. ఏదీ పెండింగ్ లేకుండా సీటుని అద్దంలా పెట్టేసింది. నాలుగ్గంటలకే పనంతా పూర్తి చేసుకుని రామారావ్ వంక చూసింది. అతని అవస్థకి జాలేసింది. వెళ్లి సహాయం చెయ్యాలనిపించింది.

కానీ అంతలోనే 'ఇన్ని రోజులూ తన వీక్‌నెస్‌తో ఆడుకున్న వాళ్లిద్దరికీ తెలిసిరావాలి.

తీసుకుంటున్న జీతానికి వాళ్లు న్యాయం చేసేవరకూ తను కలుగజేసుకోకూడదు' అనుకుని వెనక్కు తగ్గింది.

''సార్! నేను రికవరీకి వెళ్తున్నాను. కీస్ తీసుకోండి'' అని మానేజరుతో రామారావుకి వినపడేంత పెద్దగా చెప్పి బండితాళాలు ఊపుతూ ఇంటి ముఖం పట్టింది వనజ.